

# నేను - నా జ్ఞాపకాలు

## – జీడిగుంట రామచంద్రమూర్తి



*రచనా కాలం: 2019*

*(గత సంచిక తరువాయి)*

నా స్మృతి

*(70వ పుట్టిన రోజు) సాహితీ స్వర్ణోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 20-0లో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ మరియు ఢిల్లీ తెలుగు అకాడమీ వెలువరించిన అభినందన సంచికలో ప్రచురించబడిన కొందరు ప్రముఖుల సందేశాలు, నా కుటుంబ సభ్యుల అభిప్రాయాలు*

***అలుపెరుగని సాహితీమూర్తి ‘జీడిగుంట‘***

"స్నేహమేరా జీవితం" అన్నాడొక సినిమా కవి. స్నేహం లోతులు తెలిసినవాడు గనక ఆ కవి ఒక నిండు జీవితానికి స్నేహమెంత అవసరమో తెలియచెప్పినవాడు. స్నేహితులుగా చెలామణి అయ్యే వారందరూ స్నేహితులు కారు. వీళ్ళందరికీ స్నేహం విలువ ఏమిటో తెలుసునని నేను అనుకోను. నిజమైన స్నేహితుడు "ఫ్రెండ్‌షిప్ బ్యాడ్జ్" పెట్టుకుని తిరగడు. అవసరమయినప్పుడు ఆపద్బాంధవుడిలా ఆదుకుంటాడు. ఇలా నిజమైన స్నేహానికి అసలైన, సిసలైన అర్థం తెలిసినవారు శ్రీ జీడిగుంట రామచంద్రమూర్తి.

మూర్తిగారి కథలు చదువరులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. కరుణ రసం, హాస్యరసం, దుఃఖరసం అన్నీ ఆయన కథల్లో కనిపిస్తాయి. ఆయన వ్రాసిన ఎన్నో కథలు చదివే అవకాశం నాకు వచ్చింది. నాకు ఇప్పటికీ బాగా గుర్తున్నవి, "అమ్మకోముద్దు" సెకండ్ హ్యాండ్" అనే కథలు. ఈ రెండవ కథ చదువుతుంటే చిన్నప్పుడు పుస్తకాల దగ్గరనుండి, చివరికి పెద్దయిన తరువాత కూడా వైవాహిక బంధానికి సంబంధించి ‘సెకెండ్‌హ్యాండ్‘ భర్తను పొందిన అమ్మాయిపై ఎనలేని జాలి కలుగుతుంది.

ఇక నాటకాలూ, నాటికలూ ఆయనకు కొట్టిన పిండి. ఆయన సంభాషణలు వినసొంపుగా ఉంటాయి. 1960 నుండి సాహితీక్షేత్రంలో కథల పంటను పండిస్తూనే వాటికి నాటకాలను కూడా జోడించి ప్రస్తుతం డెబ్బయి ఏళ్ళ వయస్సుకు చేరినా, రచనా వ్యాసంగానికి సంబంధించి ఆయనలో ఉత్సాహం ఏ కోశాన సన్నగిల్లలేదు. ఇది తెలుగు పాఠకుల/శ్రోతల అదృష్టంగా నేను భావిస్తాను.

ఇదేవిధంగా, కథలనూ, నవలలనూ నాటకీకరణ చేయటంలో మూర్తిగారు ఆయనకు ఆయనేసాటి. ఎంతోమంది రచయితల కథలు, నవలలు, రేడియో, దూరదర్శన్‌లకోసం ఆయన నాటకీకరణ చేశారు. మా సోదరుడు కె.కె. మీనన్ రచించిన 'క్రతువు' నవలను నాటికీకరణ చేసి సీరియల్‌గా ఆకాశవాణి హైదరాబాద్ ద్వారా ప్రసారం చేసే అవకాశం శ్రీ జీడిగుంట చేతులమీదగానే కలగటం మా అదృష్టం.

*డా.కెల్.వి ప్రసాద్*

### *మంచి రచయిత - మంచి మనిషి మా రామచంద్రమూర్తి*

రామచంద్రమూర్తి సౌజన్యమూర్తి, సహృదయుడు, సకలజన సన్మిత్రుడు, అజాత శత్రువు. జీడిగుంట రామచంద్రమూర్తి అన్న పేరుకి ఇటువంటి విశేషణాలు ఎన్నయినా జోడించవచ్చు. నాలుగు దశాబ్దాలుగా నేనెరిగిన ఆయన వ్యక్తిత్వం అటువటిది. సుమారు నలభైయ్యేళ్ళ క్రితం మూర్తిగారూ, అంతకి ఆరేడు సంవత్సరాల ముందుగా నేనూ ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో చేరాం. హైదరాబాద్ రేడియో స్టేషన్ పాత భవనంలో, వెనకవైపు ఒక మూల న్యూస్ రూమ్ వుండేది. ఒకనాడు నేను న్యూస్ రూమ్ బయట నిలబడి వుండగా మూర్తిగారు వచ్చి, తన్ను తాను పరిచయం చేసుకుని 'మీ వార్తలూ, నాటకాలూ నాకిష్టం, రాంబాబుగా మీరు నిర్వహించే కార్మికుల కార్యక్రమం నాకిష్టం. నేను కొత్తగా రేడియోలో చేరాను. మీబోటి వారి సహకారమూ, ప్రోత్సాహమూ నాకవసరం' అన్నారు. ఆనాడు ఆయన వాడిన మాటలు అక్షరాలా ఇవికాకపోవచ్చుగానీ ఆ మాటల భావం మాత్రం ఇదే ప్రథమ పరిచయంలోనే ఆయన సౌజన్యం, సౌమరస్యం నన్ను ఆకర్షించాయి, ఆకట్టుకున్నాయి.

రామచంద్రమూర్తిగారి గొప్పతనం ఏమిటంటే తన కెరీర్ ప్రారంభ దశలో నలభైయేళ్ళ క్రితం, ఎంత అణుకువగా నిరాడంబరంగా వుండేవారో ఇప్పటికీ అంతే. అనవసరమైన ఆత్మస్తుతిగానీ అహంకార ప్రదర్శనగానీ ఆయనలో నేనెన్నడూ చూళ్ళేదు.

రేడియోలోనే కాదు పత్రికలు, టెలివిజన్, సినిమా, నాటకరంగం వంటి అన్ని రంగాల్లోనూ బహుముఖమైన తన శక్తి సామర్ధ్యాలు నిరూపించుకున్నారు. రచయితగా తన ప్రతిభ ప్రదర్శించారు. ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. సన్మానాలూ, సత్కారాలూ పొందారు. జీడిగుంట రామచంద్రమూర్తి అనే ఆయన ఇవ్వాళ సీనియర్ రచయిత మాత్రమే కాదు పలుమార్లు, పలు సందర్భాల్లో పలు విధాల తన ప్రతిభను నిరూపించుకున్న రచయిత.

రచయితగానో, రేడియో కళాకారుడిగానో, కార్యక్రమ నిర్వాహకుడుగానో రామచంద్రమూర్తిగారిని నేనెంతగా గౌరవిస్తానో, వ్యక్తిగా ఆయన్ని మరింతగా గౌరవిస్తాను.

నిజానికి రామచంద్రమూర్తిగారిని చూస్తే నాకు అసూయ. ఎందుకంటే ఇన్నేళ్ళుగా ఇన్ని రంగాల్లో ఇంతటి పేరు ప్రఖ్యాతులు సంపాదించినా వ్యక్తిత్వాన్ని కూడా పదిలంగా పదికాలాలపాటు నిలబెట్టుకోగలగడమన్నది గొప్ప విషయం. అరుదైన ఆ గొప్పతనం ఆయనలో వుంది.

**శ్రీ డి. వెంకట్రామయ్య**
**రచయిత, న్యూస్ రీడర్.**

### *అరుదైన వ్యక్తిత్వం.. వెలలేని అభిమానం*

సంఘనీతీ, దైవప్రీతీ పరోపకార ప్రవృత్తీ ఈ త్రిగుణాలు ఉత్తమ వ్యక్తిత్వానికి చిహ్నాలుగా పెద్దలు భావిస్తారు. ఈ మూడు లక్షణాలూ మూర్తీభవించిన మానవతావాది రామచంద్రమూర్తిగారు. ఎవరికైనా దెబ్బ తగిలితే 'అయ్యో' అనడం సర్వసాధారణం. కానీ జీవితంలో దెబ్బతిని 'అసలు బ్రతుకే ఎలా?' అనే పరిస్థితిలో 'బెంగపడక. ఏదో ఉద్యోగం దొరుకుతుంది నేనున్నాను' అంటూ చేయూత అందించి జీవన పయనంలో తొలి అడుగులు వేయించి ఆత్మస్థైర్యాన్ని నింపడం సామాన్య విషయం కాదు. 1970 దశకంలో మాకు జీవితమే ప్రశ్నార్థకంగా మారినప్పుడు ఒక ఆలంబనగా కాదు, పితృస్థానంలో నిలబడి మార్గదర్శకం చేసిన శ్రీ జీడిగుంట రామచంద్రమూర్తిగారి వ్యక్తిత్వం సాటిలేనిది.

నిరాడంబరం, నిస్వార్థం, అభిమానం రామచంద్రమూర్తిగారి నడవడిలో తొణికిసలాడుతాయి. బిడియం ఆయన ఆభరాణం. ఎవ్వరినీ నొప్పింపని నైజంతో వీలయితే ఓ మంచిమాట చెబుతారు. రచనలన్నీ హృదయాలను కదిలించే అంశాల కదలికలు. మీడియాకి, అందునా ప్రభుత్వ నియమ నిబంధనల చట్రంలో ఇమిడిపోయి రచనలు సాగించి ప్రజల గుండెల్లో సుస్థిరస్థానం సంపాదించడం అసాధ్యం. రామచంద్రమూర్తి గారు దీన్ని సాధించారు. ఒక ప్రత్యేక ఒరవడికి శ్రీకారం చుడుతూ జీవనయాత్రలో అనేక బంధాలనూ అనుబంధాలనూ తమ రచనల్లో ప్రతిబింబించారు.

క్రొత్తగా ఎవరైనా, చిన్నవారైనా, పెద్దవారైనా ఈ రోజు.. ఈ క్షణం.. ఆయనను కలిసినా ముప్పై సంవత్సరాలుగా పరిచయం ఉన్నా ఆయన పలకరింపు ఒకేలా ఉంటుంది. అదే చిరునవ్వు. అదే అభిమానం. అదే ప్రేమ.

సమాజంలో మానవతా విలువలు వెల్లివిరియాలనే ఆకాంక్ష మెండుగా ఉన్న అరుదైన వ్యక్తుల్లో రామచంద్రమూర్తిగారు ఉన్నారు. ఏ పనినైనా దైవంగా భావించేవారు తక్కువగా కనిపించే నేటికాలంలో ఆ భావనను కొనసాగిస్తున్న మూర్తిగారు ఎందరికో స్ఫూర్తి. అందరికీ కష్టాలుంటాయి. కష్ట సమయంలో కొంచెం తోడ్పాటు లభిస్తే అది జీవితానికే పునాది అవుతుంది. అలాంటి పునాదిని మాకందించిన పితృసమానులు రామచంద్రమూర్తిగారు. ముగ్గురు పిల్లలతో ఒకమాదిరి సంపాదనతో సతమతమవుతున్న ఆ రోజుల్లో, ఆయన మాకు ఆశ్రయం కల్పించడం, మా బాగోగులు చూడడం అనన్య సామాన్య విషయం. పరోపకారానికి స్థాయిలు ఉండవనే సత్యాన్ని ఆ పరిస్థితుల్లోనే ఆచరించి చూపిన మానవతామూర్తి.

ఎవరు ఏ పనిమీద తమ దగ్గరకు వచ్చినా వారికి ఎంతో కొంత సాయపడాలనే ఆలోచన ఆయన అంతరంగాన మొదలౌతుంది. ఆయన నోటినుండి 'గొప్పల' మాటలు వినిపించవు. సహాయం చేసే ఆయన చేతులు ఖాళీగా ఉండవు.

స్నేహం, అభిమానం, నిండైన వ్యక్తిత్వం, మంచిని కాంక్షించే తత్వంతో అందరినీ ఆదరించే రామచంద్రమూర్తిగారు
జీడిగుంట వంశానికే ఓ కీర్తి కిరీటం.. బంధుగణాలకు ఆచరణీయమార్గం..
స్నేహవర్గానికి ప్రేరణాసూత్రం... సమాజ హితానికి ఓ అంకిత భావం..!

**సత్యవోలు కేశవకుమార్ (గ్రాఫిక్ సేల్స్ కార్పొరేషన్)**

**సత్యవోలు సుందరసాయి (దూరదర్శన్)**

### *నాన్న గురించి నాలుగు మాటలు*

70 ఏళ్ళ జీవితం అత్యంత నిరాడంబరంగా వెళ్ళబుచ్చుతూనే అందులో ఒక అర్ధ శతాబ్దాన్ని రచనా వ్యాసంగానికి అంకితమిచ్చి కుటుంబ సభ్యుల మధ్య వుండే బంధాలను తన రచనల ద్వారా చాటి చెబుతూ తను పాటించడమే

కాకుండా, మా అన్నదమ్ములు ముగ్గురికీ కూడా ఆయన ఆస్థిగా పంచారు. అందుకు "మేము నిజంగా గర్వపడుతున్నాం" అనేకన్నా 'అదృష్టవంతులమంటే' బావుంటుంది.

మా నాన్న మితభాషి - బహుశా తాను చెప్పవలసిన విషయాలు తన గళం ద్వారా కాకుండా కలం ద్వారా చెపితే ఎక్కువ ప్రభావముంటుందనుకోవటం వల్లనే మాకు ఆయన రచనలద్వారా మానవతా విలువలూ, ప్రేమానురాగాలూ, వినయ విధేయతలు వంటి మంచి గుణాలు తెలియపరిచారనిపిస్తుంది.

ఆ మాటకొస్తే ఆయన చాలా కథల్లో మా అన్నదమ్ముల క్యారెక్టర్స్ కూడా కనబడుతూ వుంటాయి. ఆ క్యారక్టర్స్‌కి మా పేర్లే వుంటాయి. ఉదాహరణకి 'గోడ' అనే కథ ద్వారా మేము మా చిన్నప్పుడు మా ఇంటి పిట్టగోడ మీద కూర్చుని గొడవ చెయ్యడం గురించి ఆయన అభిప్రాయాన్ని సునిశితంగా చెప్పారు. అలాగే 'పిచ్చితండ్రి' కథ ద్వారా మేము అమెరికా వెళ్ళినప్పుడు ఆయన అనుభవించిన మానసిక క్షోభనీ ఆ తర్వాత 'అమ్మకోముద్దు' కథద్వారా మా అమ్మపైనా, తన పిల్లలపైనా వున్న ప్రేమనీ, ఆయన ఎంతో ఆర్ద్రతతో తెలియపరిచారు.

మా నాన్నకి నాకంటే పెద్ద అభిమాని బహుశా వుండరేమో. ఇది కేవలం నా "అభిప్రాయమే" కాదు గట్టి నమ్మకం కూడా. నేను ఆయన రాసిన కథలకే కాదు ఆయన జీవన విధానానికి కూడా పెద్ద ఫ్యాన్‌ని. ఈ విషయం నాన్నకి కూడా తెలుసు అనుకుంటాను. అందుకే కాబోలు ఆయన నన్ను సెంట్రల్/మెయిన్ క్యారెక్టర్‌గా పెట్టి ఎన్నో కథలు రాశారు.

నాకు ఊహ తెలిసినప్పటినుండీ మొదలుకుని 1994లో నేను అమెరికా వెళ్ళేవరకూ మేమతా ఉమ్మడి కుటుంబంగా కలిసి వుండేవాళ్ళం. అంతకుముందు 1989లో ఓ ఏడాదిపాటు నాన్న ఉద్యోగరీత్యా కడప ఆకాశవాణిలో పనిచేసినప్పుడనుకుంటా, నాన్నని మిస్ అవుతున్నానన్న ఫీలింగ్ కలిగేది. అప్పుడే ఆయనకి ఒక ఉత్తరం రాసా. దాన్ని బేస్‌గా తీసుకుని దాదాపు 20 సంవత్సరాల తర్వాత 'నాన్నకో ఉత్తరం' అని కథ రాసారు. ఆ కథ చదివిన వాళ్ళెవరైనా వాళ్ళ వాళ్ళ నాన్నలకి తమ భావాలని తప్పకుండా వెళ్ళబుచ్చుకుంటారని నా అభిప్రాయం. అంతేకాదు ఏ కొడుక్కీ ఏ నాన్నా ఇవ్వలేని అద్భుతమైన బహుమానాన్ని నాకు ఆయన ఇచ్చారు.

**విజయసారధి**

**(జేష్ఠ పుత్రుడు)**

***మా నాన్న మనసే వెన్న.. అమృతం కన్నా మిన్న..!***

'మీ పేరేమిటీ?' అని ఎవరైనా అడిగినపుడు, నేను నా పేరు చెప్పగానే 'జీడిగుంట రామచంద్రమూర్తిగారు మీకేమౌతారు?' అని ఎంతోమంది అడుగుతూ వుంటారు. 'ఆయన మా నాన్న' అని చెప్పగానే వారంతా ఆయన గొప్పతనం గురించి నాకు చెప్పినప్పుడూ, ఆయన్ని పొగుడుతూ మాట్లాడినప్పుడూ నా ఆనందానికి అవధులుండవు.

ఎందుకంటే ఓ 'ఫేమస్' ఫాదర్‌కి నేను కొడుకుని అయినందుకు నేను కూడా 'ఫేమస్ సన్' అయ్యానన్న గర్వం కలుగుతున్నందుకు. ఎంతోమంది పిల్లలకు పుట్టగానే ఓ ఐడెంటిటీ వస్తుంది. అలాంటి ప్రత్యేక గుర్తింపు నాకూ దొరకటం నా అదృష్టంగా భావిస్తుంటాను.

మా నాన్నది అద్భుతమైన వాచికం. మధురమైన గొంతు. పర్‌ఫెక్ట్ పంక్చ్యుయేషన్స్.. ఎక్సలెంట్ మోడ్యులేషన్. అందుకే ఆకాశవాణి నాటక విభాగంలో ప్రయోక్తగా, నటుడిగా ఆయనను చాలామంది నటీనటులు ఇప్పటికీ గౌరవాభిమానాలతో

పలుకరిస్తుంటారు. ఎంతోమంది ఔత్సాహికులతో ఆయన రచనలు చేయించారు. పరిషత్తు నాటకాలకు న్యాయనిర్ణేతగా వెళ్ళిన సందర్భాల్లో ఎవరిదైనా 'మంచికంఠం' గమనిస్తే వారిని ప్రత్యేకంగా మెచ్చుకుని, రేడియో డ్రామా ఆడిషన్‌కి ఆహ్వానించటం కూడా నాకు తెలుసు. 'జీడిగుంటగారి సూచనలద్వారా, సలహాల ద్వారా మేమూ ఈ రోజు రచయితలమయ్యాం, మంచి నటులమయ్యాం, మంచి డబ్బింగ్ ఆర్టిస్టులమయ్యాం" అని ఎందరో నా దగ్గర చెప్తుంటారు. నేను గర్వపడుతూంటాను.

మా నాన్న ఏపని చేసినా అందులో పూర్తి నిబద్దతా, సిన్సియారిటీ, డెడికేషన్, అన్నింటినీ మించి నూటికి నూరుపాళ్ళు కమిట్‌మెంట్ వుంటాయి. 'వర్క్ ఈజ్ వర్షిప్' అని నమ్మే మా నాన్న, మా అన్నదమ్ములు ముగ్గురికీ వాటిని పుష్కలంగా అందించారు. ఈనాటికీ ఎవరిమీదా ఆధారపడకుండా ఆయన పనులన్నీ ఆయనే చేసుకుంటారు. మాలో ఎవరికీ ఏ పనీ చెప్పకపోగా కొన్ని సందర్భాల్లో మా పనులు కూడా ఆయనే చేసి పెడుతూంటే మేం కొంచెం 'గిల్టీ'గా ఫీలవుతుంటాం. మరొకళ్ళని ఇబ్బంది పెట్టటం అంటే ఏమిటో ఆయనకు తెలీదు.

మా నాన్న చాలా తక్కువ మాట్లాడతారు. చాలా ఎక్కువ రాస్తారు. గర్వంకానీ అహంకారంకానీ అస్సలు తెలీదు. ఆయనకు తెలిసిన విషయాన్నీ జ్ఞానాన్నీ అందరికీ పంచటమే ఆయనకు తెలుసు. ఆయనకు తెలిసిన విషయాన్నీ, జ్ఞానాన్నీ అందరికీ పంచటమే ఆయనకు తెలుసు. ఆయన చాలా సందర్భాల్లో అంటూంటారు. "పొగరుండవచ్చుగానీ పొగరుండకూడదు" అని. అలాగే "కారం కొంచెం ఎక్కువ తిన్నా ఫరవాలేదుకానీ అహంకారం అస్సలుండకూడదు" అని కూడా అంటుంటారు.

మాతో చెప్పాలనుకున్న విషయాన్ని ఆయన మాతో డైరెక్ట్‌గా చెప్పరు. అన్నీ కథలుగా రాస్తారు. పిల్లలు ఎలా చదువుతున్నారని మా అమ్మనుగానీ, 'ఏం చదువుతున్నారని మమ్మల్నిగానీ ఆయన గట్టిగా అడిగిన జ్ఞాపకంలేదు. అలాగే మమ్మల్ని 'చదవండి' అంటూ తిట్టేవారు కాదు.

'రేడియో, టీవీ, స్టేజ్, సినిమా మీడియాల్లో రచయితగా పేరు తెచ్చుకున్న మా నాన్న ఏ మీడియాకి ఎలా రాయాలో తెలిసిన కొద్దిమందిలో ఒకరు' అని గట్టిగా చెప్పగలను. మా నాన్నగారి ఇన్‌స్పిరేషన్‌తోనే నేను ఇవాళ రేడియో, టీ.వి, స్టేజి, సినిమాలలో ఆర్టిస్టుగా 'రవ్వంత' పేరు తెచ్చుకున్నాననిపిస్తుంది.

కథా రచయితగా మా నాన్న గురించి చెప్పాలంటే ఆయన కథలన్నీ మానవసంబంధాలతోటే ముడిపడివుంటాయి. చక్కని కుటుంబ కథలే అన్నీ. ప్రతి కథా పాఠకుణ్ణి కదిలిస్తుంది. కొన్ని కథలు కళ్ళను చెమరింపచేస్తాయి. కొందరు మా నాన్నని 'మితభాషి' అంటారు. ఇంకొందరు 'హితభాషి' అంటారు. మరికొందరు 'స్మితభాషి' అంటారు. నేనైతే ఆ మూడూ ఆయనకు వర్తిస్తాయంటాను.

ఏ విషయంలోనూ, ఎవరితోనూ, అనవసరమైన ప్రమేయం పెట్టుకోకపోయినా అందరికీ తప్పకుండా "ఆరోగ్యం జాగ్రత్త డబ్బు సంపాదించుకోకపోయినా ఫరవాలేదు. ఆరోగ్యాన్ని మాత్రం పాడుచేసుకోకండి" అని చెప్పే మా నాన్నకి ఆ భగవంతుడు నిండు నూరేళ్ళూ ఇలాగే, సంపూర్ణమైన ఆరోగ్యాన్నీ ఆనందకరమైన జీవితాన్ని ప్రసాదించాలని నేను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

జీడిగుంట శ్రీధర్
(ద్వితీయ పుత్రుడు)

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

COMMENTS